నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | MEDAK

పరవళ్లు తొక్కుతున్న మంజీరా

- దుర్గమ్మ ఆలయం మూసివేత

ఏడుపాయల దుర్గమాత ఆలయం ఎదుట మంజీరాలో ప్రవాహం

పాపన్నపేట, సెప్టెంబర్ 24: మెదక్ జిల్లా సింగూరు ప్రాజెక్టు నుంచి 11వ గేటు తెరవడంతో వనదుర్గప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. ఏడుపాయల వనదుర్గా మాత ఆలయాన్ని అధికారులు మూసివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టు నిండింది. దీంతోప్రాజెక్టుకు సంబంధించిన 11వ నెంబర్ గేట్ ఎత్తి మంజీరా నీటిని కిందికి వదిలారు. ఆ నీరు వనదుర్గా ప్రాజెక్టుకు చేరుకుంది. సింగూరు ప్రాజెక్టు గేట్లు తెరవడంతో 8000 వేల క్యూసెక్కుల నీరు వనదుర్గాప్రాజెక్టు వైపు పరుగులిడుతుంది. దీంతో ప్రాజెక్టుపై నుంచి నీరు పరుగులిడుతూ దుర్గమాత ఆలయం ముందు నుంచి ప్రవహిస్తున్నది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. మంజీరా ప్రవాహం తగ్గితే అమ్మవారి ఆలయం పునఃప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

వంట..తంటా..!

- భారంగా మారిన మధ్యాహ్న భోజన పథకం అమలు
- నెలనెలా బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- అప్పులు తెచ్చి వండి పెడుతున్న వంట కార్మికులు
- నాలుగు నెలలుగా అందని కోడిగుడ్ల బిల్లులు
- రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు
- సలసల కాగుతున్న నూనెల ధరలు
- బిల్లులు ఇవ్వాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్న కార్మికులు
- నేడు సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

సిద్దిపేట, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు, ఆకలితో విద్యార్థులు అలమటించకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన పథకం నీరుగారుతున్నది.భోజనం వండిపెడుతున్న కార్మికులకు నాలుగు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయట అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే బిల్లులు ఉండడంతో వచ్చే బిల్లులు వడ్డీలకే సరిపోతున్నాయని కార్మికులు వాపోతున్నారు. వంట వండడం కష్టంగా ఉందని జిల్లాలో పాఠశాలలో పనిచేస్తున్న భోజన కార్మికులు చెబుతున్నారు. బుధవారం(నేడు) సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఎంఈవోలను, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అలర్ట్ చేసింది. కమిషనర్ పర్యటన నేపథ్యంలో ప్రతి పాఠశాలను శుభ్రంగా ఉంచాలని, ఆ రోజు ఉన్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కిచెన్‌షెడ్ పరిసరాలు, చుట్టుపక్కల వాతావరణం బాగుండేలా చూసుకోవాలని ఆదేశించారు. దీనిని బట్టి చూస్తే మిగతా రోజుల్లో మెనూ అమలు కావడం లేదని తెలుస్తున్నది. నాణ్యమైన భోజనం పెట్టడం లేదా ..? అనే సందేహాలు కలుగుతున్నాయి.

ధరాఘాతంతో విలవిల..

మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు అందరికీ చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల నూనెల ధరలు బాగా పెరిగాయి. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో మధ్యాహ్న భోజనం వండడం కష్టం గా మారిందని భోజన కార్మికులు వాపోతున్నారు. పెరిగిన ధరలతో సరుకులు కొనలేని పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సిన బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. నాలుగు నెలలుగా కోడిగుడ్డ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన అమలు లక్ష్యం నీరుగారుతున్నది. ఉన్న సరుకులతో పిల్లలకు వండిపెడుతున్నామని, బయట వడ్డీలకు ఎంతగానం డబ్బులు తెస్తామంటూ కార్మికులు చెబుతున్నారు. ప్రతినెలా సరిగ్గా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమకు కమీషన్ పెంచాలని కార్మికులు కోరుతున్నారు. ఒకవైపు బిల్లులు అందక ఇక్కట్లు పడుతుంటే...మరోవైపు మెనూ సరిగ్గా పాటించి నాణ్యమైన భోజనం పెట్టాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ఇదే సమయంలో పెండింగ్ బిల్లులు చెల్లిస్తే కార్మికులు కూడా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడానికి అవకాశం ఉంటుంది.ఈ విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 921 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా యి. వీటిలో 73,246 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థుల సంఖ్య ను చూసుకుంటే 69 వేల మంది ఉంటారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ పిల్లలకు వంట వండడానికి జిల్లాలో మొత్తం 1982 మంది మధ్యాహ్నభోజన కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతినెలా రూ. 60 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం 1వ తరగతి నుంచి 5వ వరకు రూ. 10.45 డబ్బులు చెల్లిస్తున్నది. 6వ తరగతి నుంచి 8వ వరకు రూ. 13.17 చెల్లిస్తున్నది. 9వ, 10వ తరగతుల విద్యార్థులకు రూ. 10.67 చొప్పు న చెల్లిస్తున్నది. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు కోడిగుడ్డు చార్జీల విషయంలో వేర్వేరుగా చెల్లిస్తున్నారు. కోడిగుడ్డ చార్జీలు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ట్లు మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. నూనె లేనిది వంట పూర్తికాదు. ప్రస్తుతం ఒక్కో రకం లీటర్ నూనె ప్యాకెట్ చేసుకుంటే సన్‌ఫ్లవర్ నూనె ధర రూ 200, పామాయిల్ రూ 160, వేరుశనగ రూ. 190 ధరలు మార్కెట్‌లో ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లాలోనే బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు క్రస్ట్ గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద

సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద

క్రస్ట్ గేట్ ఎత్తి దిగువకు నీటి విడుదల

పుల్కల్, సెప్టెంబర్ 24: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నీటితో నిండి కళకళలాడుతోంది. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలు కాస్త తగ్గు ముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే వరద సైతం తగ్గింది. ఉన్నట్టుండి సోమవారం వరద తీవ్రత పెరగడంతో అప్రమత్తమైన నీటిపారుదలశాఖ అధికారులు 11వ గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి వరద పెరిగిందని ఏఈ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టులోకి వరద అధికంగా వస్తున్న కారణంగా అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు నీటి హెచ్చుతగ్గులను గమనిస్తూ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.అందులో భాగంగానే మంగళవారం కూడా ప్రాజెక్టులోకి వరద కొనసాగుతుండటంతో అధికారులు 11వ గేటు 1.50 మీటర్ల ఎత్తు లేపి 4919 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండగా, 2823 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 29.857 టీఎంసీలుగా ఉన్నది. ప్రాజెక్టులోకి 9967 క్యూసెక్కుల నీరు వరద రూపంలో వస్తుండగా,అవుట్‌ఫ్లో 8243 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

క్రీడా కేంద్రంగా హుస్నాబాద్‌ను తీర్చిదిద్దుతాం

- మినీ స్టేడియంలో సకల సౌకర్యాలు కల్పిస్తాం
- క్రీడాకారులను ప్రోత్సహించాలి
- రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మినీస్టేడియంలో స్థానిక క్రీడాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సెప్టెంబర్ 24: హుస్నాబాద్ పట్టణాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, ఇందుకు స్థానికంగా ఉన్న క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మినీస్టేడియాన్ని ఆయన సందర్శించారు. అక్కడి కబడ్డీ కోర్టును ప్రారంభించి ఆటను తిలకించారు. ఇండోర్ స్టేడియంలో కాసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. పలువురు క్రీడాకారులను కలిసి వారికి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం టీఎస్ మోడల్‌స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పక్కనే ఉన్న గిరిజన బాలికల వసతిగృహాన్ని సందర్శించి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. డిగ్రీ కళాశాలకు వరద వస్తున్నందున దానికి అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్టేడియానికి వచ్చిన క్రీడాకారులు, నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోని సీనియర్ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు క్రీడలపై ఆసక్తిని పెంచుకుంటున్న క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. మినీ స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నగదు బహుమతి ఇస్తామని, అందుకు అనుగుణంగా క్రీడాకారులు ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, చిత్తారి పద్మ, భూక్యా సరోజన, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, డాక్టర్ కొంకటి రవి, కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, ఎండీ హసన్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా'లో భాగస్వాములు కావాలి

హుస్నాబాద్, సెప్టెంబర్ 24 : పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు వద్ద గణేశ నిమజ్జనం జరిగిన ప్రాంతంలో వ్యర్థాలను తొలిగించే పనులు జరిగాయి. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి స్వయంగా వ్యర్థాలను తొలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జనం తర్వాత చెరువులు, కుంటల్లో వాటికి సంబంధించిన వ్యర్థాలను తొలిగించినప్పుడు గణేశ్ ఉత్సవాలకు పరిపూర్ణత లభిస్తుందన్నారు. దీని వల్ల నీళ్లు కలుషితం కాకుండా, వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. హుస్నాబాద్ పట్టణానికి స్వచ్ఛ పట్టణంగా మార్చుకునేందుకు ప్రజలు నడుం బిగించాలన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజితావెంకట్, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్లు వల్లపు రాజు, సరోజన, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, మాజీ ఎంపీపీ వెంకట్ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 24: టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో టీజీఐఐసీ అధికారులు, పారిశ్రామికవేత్తలు, సంబంధితశాఖల జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన హుస్నాబాద్ ప్రాంతంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో టీజీఐఐసీ ద్వారా 80 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ నిర్మాణానికి ఇప్పటికే సర్కారు రూ. 431 కోట్లు మంజూరు చేసిందన్నారు. సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, జిల్లా పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా

- యువత, ఉద్యోగస్తులకు అండగా ఉంటా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

మెదక్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులు, యువత కోసం సేవకుడిగా పనిచేస్తానని, నిరంతరం అందరికీ అందుబాటులో ఉంటానని మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 34 ఏండ్లుగా వేలాది మంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దానన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఐదువేల మంది ఉద్యోగులు ఉంటారని, 1.70 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. నిరుద్యోగులు, యువత కోసం పెద్దల సభలో వాణి వినిపించడానికి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. మెదక్ జిల్లాలో పట్టభద్రులు లక్ష వరకు ఉన్నారని, గతంలో జిల్లాలో 17వేల మంది మాత్రమే ఎన్‌రోల్ చేసుకున్నారని, గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు పట్టభద్రుల పక్షాన లేకపోవడం వల్ల ఎన్‌రోల్ తగ్గిందని, గత సంవత్సరం ఓటు వేసిన వారు మళ్లీ ఫామ్-18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2021 కంటే ముందు డిగ్రీ పూర్తయిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు నమోదు చేసుకోవాలన్నారు. ప్రైవేట్ విద్య సంస్థల్లో పని చేస్తున్న టీచర్లకు హెల్త్ కార్డులు వచ్చే విధంగా కృషి చేస్తానని, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యా సంస్థల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో స్నేహ విద్యాసంస్థల అధినేత సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సమావేశానికి

మంత్రులు డుమ్మా

రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 24: కాంగ్రెస్ మంత్రుల తీరుపై రేషన్ డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డీలర్ల సమావేశానికి కాంగ్రెస్ మంత్రులు గైర్హాజరయ్యారు. వాస్తవానికి గత నెల 27వ తేదీనే రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సమావేశం జరగాల్సి ఉండగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ షెడ్యూల్ అనుకూలంగా లేక సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు. తిరిగి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి సంబంధించి రేషన్ డీలర్ల సంఘం సభ్యులు మంత్రులకు ఆహ్వానం అందజేసినా ఏ ఒక్కరు కూడా హాజరుకాకపోవడంపై విస్మయం చెందారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అన్నీ తానై వ్యవహరించారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని డీలర్లు ఎన్నుకున్నారు.

సంపూర్ణ సహకారం అందజేస్తా

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వంబర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ ఏర్పాటుపై ఆరా

- క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకున్న కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ మేనేజర్ గీత
- ఇబ్బందులపై మొరపెట్టుకున్న బాధిత రైతులు

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్ చెరువును ఫోన్‌లో చిత్రీకరిస్తున్న జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ మేనేజర్ గీత

జహీరాబాద్, సెప్టెంబర్ 24: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల శివారులో 2003 ఎకరాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ నుంచి వెలువడే కాలుష్యం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సివస్తుందని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇటీవల ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు, ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపట్టి సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీ ఏర్పాటు వల్ల విడుదలయ్యే కాలుష్యం, వ్యర్థజలాలతో మంజీరానదికి ప్రమాదం పొంచి ఉందా లేదా అనే వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు మంగళవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ మేనేజర్ గీత సందర్శించారు. ఆయా గ్రామాల పరిధిలోని భూములు, నీటి వనరులు కాలుషితమవుతాయా లేదా అనే వాస్తవ పరిస్థితులపై మండలంలోని డప్పూర్ గ్రామ శివారులోని చెరువు, న్యాల్‌కల్, నక్కల, కోట, చాకలి వాగులు, చినిగేపల్లి ప్రాజెక్టు, చాల్కి గ్రామ శివారులోని మంజీరానది తీరాన్ని పరిశీలించారు. నాయకులు, బాధిత రైతులు ఫార్మాసిటీ ఏర్పాటుతో కలిగే ఇబ్బందులను ఆమెతో మొరపెట్టుకున్నారు. ఆమె వెంట మండల డి ప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ శ్యామ్‌రావు, బాధిత రైతులు, ప్రజలు ఉన్నారు

ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలి

చీఫ్ ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

మెదక్/సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్), ఈఆర్‌వో నెట్ 2.0పై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులతో కలిసి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. వారం రోజులుగా నూతన ఓటర్ నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పనితీరు మెరుగుపడిందన్నారు. ఇప్పటి వరకు 90 శాతానికిపైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, ఈనెల 28 నాటికి ఇంటింటి సర్వే వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ నెలాఖరు వరకు పెండింగ్‌లో ఉన్న ఓటర్ల నమోదుకు సంబంధించి ఫార్మ్ 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులతో సమావేశమై ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లో బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి, ఓటరు జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పుల గురించి ఓటర్లకు వివరించాలన్నారు. మరణించిన వారి ఓట్లను తొలిగించడం, ఫొటో గుర్తింపు కార్డుకు సంబంధించి సరిగ్గాలేని ఫొటోలను సేకరించాలన్నారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, అన్ని మండలాల తహసీలార్లు, ఎన్నికల సూపరింటెండెంట్లు, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మట్టి పరీక్షలు చేయనున్న కొత్లాపూర్ విద్యార్థులు

- సొంతంగా సాయిల్ హెల్త్‌కార్డుల తయారు
- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన
- త్వరలో మట్టి పరీక్ష కిట్లు అందజేత

మట్టి నమూనాల సేకరణ, పరీక్ష గురించి విద్యార్థులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

సంగారెడ్డి సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆచరణాత్మక వ్యవసాయ విద్యను నేర్పించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ 'స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్' ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు కేంద్ర వ్యవసాయశాఖ చేపట్టింది. సంగారెడ్డి జిల్లాలోని కొత్లాపూర్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైంది. కొత్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 7,8,9, 10వ తరగతుల్లో ఎంపిక చేసిన విద్యార్థులు సొంత గ్రామంలో మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల నిర్వహణ, సాయిల్ హెల్త్‌కార్డుల తయారీ చేపట్టనున్నారు. ఇందుకోసం సంగారెడ్డిలోని వ్యవసాయశాస్త్రవేత్తలు, సాయిల్ టెస్టు లేబొరేటరీ అధికారులు మంగళవారం కొత్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్, వ్యవసాయశాస్త్రవేతలు డాక్టర్ రాహుల్, డాక్టర్ వరప్రసాద్, సాయిల్ టెస్టు లేబొరేటరీ ఏడీఏ అంబికా సోనీ సాయిల్ హెల్త్, మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. మట్టి పరీక్షల నిర్వహణకు త్వరలోనే ప్రత్యేక కిట్లు అందజేయడంతోపాటు సాయిల్ హెల్త్‌రిపోర్టుల తయారు కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ యాప్‌ను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవస